తగ్గిన చికెన్ ధరలు

- కార్తీకం ఎఫెక్ట్‌తో కిలో రూ.120కి పడిపోయిన ధర
- చేపలు, గొర్రెల మాంసం అమ్మకాలపై కూడా ప్రభావం
- నష్టపోతున్నామని వాపోతున్న విక్రయదారులు

హిందూపురం: కార్తీక మాసం ఎఫెక్ట్ చికెన్ విక్రయాలపై పడింది. గత నెల రోజులుగా చికెన్ ధరలు అంతకంతకూ కిందకు పడిపోతున్నాయి. గతంలో రూ.250 వరకూ ధర పలికిన కేజీ చికెన్ ధర ప్రస్తుతం రూ.120కి పడిపోయింది. విత్‌స్కిన్‌తో రూ.150కు లభిస్తోంది. కార్తీకమాసం ఎఫెక్ట్, పూజల మాసం కావడంతో వినియోగదారులు మాంసంపై ఆసక్తి చూపడం లేదు.

చలి ప్రభావంతో..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 380 దాకా కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో సుమారు 30 లక్షలపైగా కోళ్ల పెంపకాలు జరుగుతాయి. రోజుకు సుమారు 20 లక్షల కేజీలు వినియోగం జరిగేది. ఆదివారం ఇతర దినాల్లో కూడా అమ్మకాలు బాగా ఉండేవి. ప్రస్తుతం చలి ప్రభావానికి కోళ్ల మరణాలు పెరగడంతో నష్టాలు ఎదుర్కోవల్సి వస్తుందని పెంపకందారులు చెబుతున్నారు. కిలో కోడి సిద్ధం కావడానికి సుమారు రూ.100కు పైగా ఖర్చు అవుతోందని, అయితే అమాంతంగా తగ్గిపోయిన చికెన్ ధరలతో నష్టాలు చవిచూస్తున్నామని పెంపెకందారులతో పాటు అమ్మకందారులు పేర్కొంటున్నారు.

ప్రతి ఏడాది రెండు నెలలు..

కార్తీక మాసం అయ్యప్ప, భవానీ, వేంకటేశ్వర స్వామి, శివమాలధారులు, ఇతర పూజల కారణంగా చికెన్, చేపలు, గొర్రె మాంసం విక్రయాలకు డిమాండ్ తగ్గిపోయింది. ప్రతి ఏడాది నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో ధరలపై తీవ్ర ప్రభావం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఫిబ్రవరి నెల నుంచి మాంసం, చికెన్ వ్యాపారాలు క్రమంగా పెరుగుతాయని అంటున్నారు. గత రెండు నెలలు చికెన్ ధరలు, అమ్మకాలు తగ్గిపోతాయని చెబుతున్నారు.



హిందూపురంలో అమ్మకానికి ఉంచిన చికెన్

చికెన్ అమ్మకాలతో నష్టపోతున్నాం



చికెన్ ధరలు తగ్గిపోవడంతో రెండు నెలలుగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అప్పుడప్పుడు చికెన్ మిగిలిపోవడంతో హోటల్స్, చికెన్ బండ్లవారికి తక్కువ ధరలకే ఇచ్చి కొంతమేరకు సరిపెట్టాల్సి వస్తోంది. పనివారికి వేతనాలు, ఖర్చులు వల్ల కొంత నష్టం భరించాల్సి వస్తోంది.

– ముబారక్ , హిందూపురం

విక్రయాలు తగ్గాయి



ప్రతి ఏడాది నవంబర్, డిసెంబర్ మాసాల్లో విక్రయాలు తగ్గుతాయి. అలాగే చలి కారణంగా కోళ్లు చనిపోయే పరిస్థితి ఉంటుంది. ఈ రెండు కారణాలతో వ్యాపారులు నష్టాలను చవిచూస్తున్నారు. డిసెంబర్ చివరి వారం, జనవరి మాసం నుంచి వ్యాపారాలు పుంజుకుంటాయి. అప్పటి వరకూ ఈ పరిస్థితి తప్పదు.

– రవి, హిందూపురం

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

హిందూపురం: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులతో మాట్లాడారు. ప్రజల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారానికి త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. అనంతరం పైల్‌లైన్ రోడ్డులో జరుగుతున్న మట్టిరోడ్డు పనులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



బిల్లులు చెల్లింపునకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు

హిందూపురం: అనంతపురం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌పోటీల్లో పురం విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు సెన్సెయి ఇన్‌స్ట్రక్టర్ ఫైరోజ్ తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు జరిగిన ఈపోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను నుంచి క్రీడాకారులు హాజరైనట్లు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా తరుపున ఎన్నికై నా హిందూపురంలోని పలు స్కూళ్లకు చెందిన విద్యార్థులు 15 మంది పాల్గొన్నట్లు చెప్పారు. ద్వితీయ స్థానంలో శోభన్, నేహా, బిందుశ్రీ , భావన, యాలిని తృతీయ స్థానాల్లో జాయిద్, యాసిని, దేవ నిలిచారన్నారు.



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన 'పురం' క్రీడాకారులు

నైతిక విలువలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

మడకశిర: విద్యార్థులు నైతిక విలువలతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకుడు క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి పత్రం

పెనుకొండ: మహాత్మా జ్యోతిభా పూలే బీసీ గురుకుల పాఠశాలలోని సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని మంత్రి సవితకు రాష్ట్ర బీసీ గురుకుల పాఠశాల అతిథి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిచంద్రయాదవ్, మురళీమోహన్‌రెడ్డి, రమేష్ వినతిపత్రం అందించారు. సోమవారం పట్టణంలోని మంత్రి స్వగృహంలో వారు వినతిపత్రం అందించగా నిబంధనల మేరకు న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



అగ్గి మంట చుట్టూ గొర్రెలను తిప్పుతున్న కాపర్లు

● ఆకట్టుకున్న 'ఈడీ పండుగ'

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుర్రుపుకొండ గ్రామంలో తాడినాగమ్మ, కాటమరాయ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అగ్గి మంటల చుట్టూ గొర్రెలు, పశువులను ప్రదక్షణ చేయిస్తూ ఈడి పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఇలా చేయడం ద్వారా గొర్రెలు, పశువులకు వ్యాధులు సోకవని కాపర్ల నమ్మకం. సోమవారం ఉదయం నుంచి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళలను గౌరవించాలి

అగళి: మండల కేంద్రంలోని ఆర్డీటీ భవనంలో సోమవారం ఆర్డీటీ ఏటీఎల్ ఓబలేశ్ ఆధ్వర్యంలో స్త్రీ హింస నిర్మూలను దినోత్సాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఈఓఆర్డీ పద్మ మాట్లాడుతూ.. కుటుంబంలో భార్య భర్తల ప్రవర్తన మీదనే పిల్లల జీవితాలు ఆధారపడి ఉంటాయన్నారు. పెద్దలు ఆదర్శంగా ఉంటే బిడ్డలు ఉన్నతంగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీటీ ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ప్రజల నుంచి వినతులకు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తమ సమస్యలను అర్జీ రూపంలో తీసుకొచ్చారు. అధిక శాతం రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, అదేవిధంగా కొత్త పింఛన్లు తదితర వినతిపత్రాలు అందాయని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖలకు పంపి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తహసీల్దార్ మారుతి ప్రకాష్, ఎంపీడీఓ రామరావు, అధికారులు పాల్గొన్నారు.

ఆరు అర్జీలు..

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

అట్రాసిటి జాగృతి సమితి సభ్యుడిగా నారాయణప్ప

పావగడ: స్థానిక దళిత జాగృతి సమితి అధ్యక్షుడు నారాయణప్ప తుమకూరు జిల్లా కార్యాలయం అట్రాసిటి జాగృతి సమితి సభ్యుడిగా ఎంపికయ్యారు. సోమవారం ఉత్తర్వులు వెలువడటంతో స్థానిక దళిత సంఘం నాయకులు పళవల్లి సుబ్బరాజు, టీఎన్‌పేటి రమేశ్, సీకే పురం హనుమంతరాయప్ప, మద్దిలేటప్ప, నరసింహప్ప, రామప్ప తదితరులు నారాయణప్పను ఘనంగా సన్మానించి అభినందించారు.

క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి దారి చూపండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

మడకశిర: మండలంలోని తులసీధామ వృద్ధాశ్రమానికి దారి చూపాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నాలో వృద్ధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో వందలాది మంది వృద్ధులు ఉన్నారని, కొంతమంది దారి మూసేడంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తహసీల్దార్ కరుణాకర్‌కు వినతి పత్రం అందించి న్యాయం చేయాలని కోరారు. డీహెచ్‌పీఎస్ అధ్యక్షులు హనుమంతు, ఎమ్మార్పీఎస్ నాయకులు దండు వీరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలో సోమవారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ఎన్‌సీసీ దినోత్సవ ప్రాధాన్యతను చాటి చెప్పారు. పలు అంశాలపై ఎన్‌సీసీ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో విద్యార్థులతో పాటు పోలీసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి, అంబేడ్కర్ విగ్రహాల ప్రతిష్ట



మహర్షి వాల్మీకి, అంబేడ్కర్ విగ్రహాలు ప్రతిష్ఠించిన దృశ్యం

పావగడ: తాలూకాలోని బంగారు నాయకన బెట్ట గ్రామంలో మహర్షి వాల్మీకి, భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంజయకుమారస్వామి మాట్లాడుతూ రామాయణాన్ని లిఖించిన మహర్షి వాల్మీకి, భారత రాజ్యాంగ గ్రంథాన్ని రాసిన డా బీ ఆర్ అంబేడ్కర్ ప్రతిమలను ఒకే చోట ప్రతిష్ఠించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కరియణ్ణ , లాయర్ నరసింహప్ప, నివృత్త జైలర్ తిమ్మయ్య, శివణ్ణ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ నిర్వాహకులపై ఆర్డీఓ ఆగ్రహం

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు గ్రామ సమీపంలో ఉన్న అడాప్ట్ ఆటో కంపోనెంట్ కంపెనీ నిర్వాహకులపై ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆ కంపెనీని ఆయన సందర్శించారు. సరైన భద్రత చర్యలు తీసుకోకుండా కార్మికులతో పనులు చేయించడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇద్దరు కార్మికులు గాయపడిన సంఘటనపై ఆరా తీశారు. హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలియడంతో అక్కడికి వెళ్లి వారిని పరామర్శించారు. ప్రమాద ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్ తదితరులున్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస రాజు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు డిసెంబర్ 13 నుంచి 19 వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలపై దేవదాయ, మండలస్థాయి అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈఓ నరసింహారాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సర్పంచులు కరియన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లేపాక్షి: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న దుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. సర్పంచ్ ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగరాజు, ఏఓ శ్రీలత పాల్గొన్నారు.

కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు సమీపంలో ఉన్న కియా అనుబంధ సంస్థ అయన అడాప్ట్ ఆటో కంపోనెంట్ కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి డిమాండ్ చేశారు.సీ సందర్భంగా సోమవారం ఆ కంపెనీ వద్ద ఆందోళనకు దిగారు. సూరజ్ గోస్వామి, ఉమేష్ అనే కార్మికులు పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడినా చర్యలు చేపట్టలేదన్నారు. కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడంపై అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిమ్మయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం

గుడిబండ: మండల పరిధిలోని మోరుబాగుల్ చెరువులో చేపల పెంపకానికి సోమవారం గ్రామ సచివాలయంలో ఈఓఆర్డీ నాగరాజునాయక్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. రాజు అనే వ్యక్తి రూ.3.50 లక్షలకు దక్కించుకున్నారని ఈఓఆర్డీ తెలిపారు. ఈ నిధులు పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులో అధ్యాపకులు

హిందూపురం టౌన్: శ్రీసత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఎస్‌డీజీఎస్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో డిగ్రీ, ఎంబీఏ కళాశాలల ప్రిన్సిపాళ్లు జేఎస్‌పీఎస్ ప్రసాద్, నాగేంద్రకుమార్‌లు ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించారు. తెలుగు మాధ్యమంలో భీమశెట్టి ఝాన్సీరాణి తృతీయ, ఆంగ్ల మాధ్యమంలో ఎఫ్.అలియా భాను ద్వితీయ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు.

బారికేడ్ల అందజేత

పెనుకొండ: పట్టణంలోని క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థ పోలీసుస్టేషన్‌కు సోమవారం 10 బారికేడ్లను అందజేసింది. ఆ సంస్థ ఆర్ఎం గౌసపీరా, ఏరియా మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తమవంతుగా బారికేడ్లను వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, జమేదార్ దాదాపీర్, బీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడి పూజ

రొద్దం: మండల పరిధిలోని తుకలాపట్నం గ్రామంలో సోమవారం అయ్యప్పస్వామి మాలాధారులు పడి పూజ నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరనీకుమా.. ఈ దీపం

కార్తీక మాసంలోని చివరి సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. హర హర మహాదేవ .. శంభో శంకర అంటూ భక్తులు పెద్ద ఎత్తున శివయ్యను దర్శించుకున్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో లక్ష దీపోత్సవాలను నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షిబృందం



హిందూపురం : శివాలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు



గుడిబండ: శివాలయంలో అఖండ జ్యోతి ఇలా..



మడకశిర: శివపార్వతులను ఊరేగిస్తున్న దృశ్యం



అమరాపురం: అలంకరణలో మద్దెమ్మదేవి



లేపాక్షి: అలంకరణలో వీరభద్రస్వామి



చిలమత్తూరు: అలంకరణలో బైరవేశ్వరుడు



పరిగి: బీరలింగేశ్వరాలయంలో లక్ష దీపోత్సవం

ఘనంగా గంధం వేడుకలు



గంధాన్ని మోసుకెళ్తున్న పీఠాధిపతి ఇంతియాజ్

పెనుకొండ: పట్టణంలోని హజరత్ సయ్యద్ షా గైబ్ షావలి గంధం వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. కులపెద్దలు, బంధువులు, కుటుంబ సభ్యులు వెంటరాగా పీఠాధిపతి ఇంతియాజ్ వారి కుటుంబ సభ్యులు గంధాన్ని తలపై ఉంచుకుని స్థానిక కోర్టు రోడ్డు మీదుగా ఆర్అండ్‌బి అతిథి గృహం సమీపంలో ఉన్న సయ్యద్‌షా గైబ్‌వలి సమాధి వద్దకు చేరుకుని గంధాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పక్కీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం ఉదయం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పశుగణన సర్వే పూర్తి చేయండి

రొళ్ల: గ్రామాల్లో పశుగణన సర్వేను ఈనెలాఖరు లోపు పూర్తి చేయాలని మడకశిర పశువైద్యశాఖ ఏడీ అమర్ తెలిపారు. స్థానిక పశువైద్యశాఖ కార్యాలయాన్ని సోమవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు పశుగణన సర్వే పూర్తి చేసి వివరాలను అందించాలన్నారు. అలాగే లేగ దుడలకు వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున్న వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలన్నారు. రత్నగిరి పశువైద్యాధికారి వెంకటేష్, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.